క్లుప్తంగా

సీసీసీని పరిశీలించిన ఎస్పీ ఆరీఫ్‌హఫీజ్



నెల్లూరు(బారకాసు): కార్పొరేషన్ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్(సీసీసీ)ను నూతన ఎస్పీ ఆరీఫ్ హఫీజ్ గురువారం పరిశీలించారు. తొలిసారిగా సీసీసీకి వచ్చిన ఎస్పీకి కార్పొరేషన్ కమిషనర్ వికాస్‌మర్మత్ పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం సీసీసీలోని అన్ని విభాగాల పనితీరును ఎస్పీ పరిశీలించారు. ఎస్పీ వెంట ఏఎస్పీ సౌజన్య ఉన్నారు.

ఓటమి భయంతోనే సోమిరెడ్డి ఆరోపణలు



నెల్లూరు (దర్గామిట్ట): సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి ఓటమి భయం పుట్టుకొచ్చిందని, దీంతో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై ఇష్టం వచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య పేర్కొన్నారు. నగరంలోని మాగుంటలేఅవుట్‌లోని జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో రామదాసుకండ్రికలో భూసేకరణ విషయంలో సోమిరెడ్డి దళారి అవతారం ఎత్తి దోపిడీకి యత్నించగా, నాడు ప్రతిపక్షంలో ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి అడ్డుకున్నది వాస్తవమా..కాదా.. తెలియజేయాలన్నారు. మంత్రి కాకాణి ఏపీఐఐసీ పారిశ్రామికవాడ కోసం భూసేకరణ ద్వారా 53 ఎకరాలను అందించారని, అందుకు సంబంధించి రైతులకు ఎకరాకు రూ.15 లక్షల పరిహారాన్ని నేరుగా వారి ఖాతాలోనే జమచేశారని తెలిపారు. మంత్రి కాకాణిపై మాజీ మంత్రి సోమిరెడ్డి చేసిన ఆరోపణలను ఖండిస్తున్నామన్నారు. నిత్యం దోపిడీలే పరిపాటిగా సాగించే సోమిరెడ్డి మంత్రి కాకాణిని విమర్శించడం సిగ్గుచేటు అని మండిపడ్డారు. భూ లబ్ధిదారులు నష్టపోకుండా చట్టబద్ధంగా వారికి పరిహారాలను అందజేసి ఏపీఐఐసీకి భూములను అప్పగిస్తే దానిని రాజకీయ చేయాలని చూడడం తగదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

కబోదుల్లా కాంగ్రెస్ నేతలు

నెల్లూరు(మినీబైపాస్): ప్రధాని నరేంద్రమోదీ పదేళ్ల పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంస్కరణలు కళ్లకు కనిపిస్తున్నా కాంగ్రెస్ నాయకులు కళ్లుండి చూడలేని కబోదిలా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్కే యశ్వంత్‌సింగ్ పేర్కొన్నారు. చిన్నబజార్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రధాని నరేంద్రమోడీని ఉద్దేశిస్తూ నిన్నటి రోజున కాంగ్రెస్ నేత జైరాం రమేష్ పదేళ్లలో ఎటువంటి హామీలను నెరవేర్చలేదని, జూన్ 4 తర్వాత ఆయన లాంగ్ లీవ్ తీసుకుంటారని విమర్శించడాన్ని ఖండిస్తున్నామన్నారు. జూన్ 4 తర్వాత లాంగ్ లీవ్ తీసుకునేది కాంగ్రెస్సేనన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి కుప్పా ప్రసన్నమ్మ, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లూరు నవీన్‌కుమార్ తదితరులు ఉన్నారు.

జ్యోతిరావ్ పూలే గొప్ప సంఘసంస్కర్త



పూలే దంపతులకు నివాళులర్పిస్తున్న ఎంపీ ఆదాల

నెల్లూరు(వేదాయపాళెం): సమ సమాజ స్థాపనకు కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త, మానవతావాది జ్యోతిరావ్ పూలే అని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ కొనియాడారు. జ్యోతిరావ్‌పూలే జయంతిని పురస్కరించుకుని మినీబైపాస్ రోడ్డులోని పూలే దంపతుల విగ్రహాలకు గురువారం ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ పూలే ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని, సమసమాజ స్థాపనలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా బీసీ సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య, సెట్నల్ మేనేజర్ శ్రీనివాసరావు, బీసీ సంక్షేమ, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు పాల్గొన్నారు.

• జ్యోతిరావ్ పూలే జయంతిని పురస్కరించుకుని మినీ బైపాస్‌లోని జ్యోతిరావ్ పూలే, సావిత్రిబాయి పూలే దంపతుల విగ్రహాలకు బీసీ, ప్రజా సంఘాల నేతలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్, చంద్ర రాజగోపాల్, నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, ఆంధ్రప్రదేశ్ ముదిరాజ్ మహాసభ రాష్ట్రాధ్యక్షుడు కనకట్ల రఘురాంముదిరాజ్, తదితరులు పూలే సేవలను స్మరించుకున్నారు. బీసీ, ఎస్సీ నేతలు దద్దోలు రమణయ్యగౌడ్, గరికపాటి వెంకట కృష్ణయ్య, దాసరి అనంతరామారావు, తలారి బాలసుధాకర్, అరిగెల సాయిరాం, సురేంద్రబాబు, కనకరాజు, భాగవతుల విజయరాఘవేంద్ర, పుష్పరాజ్, శేషయ్య, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

• సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో మినీ బైపాస్‌లోని పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోడూరు సత్యం, నాయకులు జయప్రకాష్, రాజేంద్ర, కృష్ణమూర్తి, సతీష్, గోళ్ల కేశవులు, తదితరులు పాల్గొన్నారు.

• బీజేపీ ఓబీసీ మోర్చా కమిటీ ఆధ్వర్యంలో పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు యాకసిరి ఫణిరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగరాల సురేష్, జోనల్ ఇన్‌చార్జి ముక్కు రాధాకృష్ణగౌడ్, కార్యవర్గ సభ్యులు గిరికుమార్, లీగల్ సెల్ కన్వీనర్ దాసరి రాజేంద్ర ప్రసాద్, తిరకాల శివ, సత్యనారాయణ, కృష్ణ, రజక సెల్ కన్వీనర్ మస్తాన్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

• అయ్యప్పగుడి సమీపంలోని బీసీ స్టూడెంట్ ఫెడరేషన్ కార్యాలయంలో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘ రాష్ట్రాధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ నేతలు జయరామరాజు, వెంగబాబు, చంద్రయాదవ్, మాధవరాజు, ప్రభాకర్, శరత్‌యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

• ఆంధ్రప్రదేశ్ చేతివృత్తిదారుల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చేతివృత్తిదారుల జిల్లా కన్వీనర్ కటికాల వెంకటేశ్వర్లు, మత్స్యకార్మిక సంఘ నేత వెంకటేశ్వర్లు, వడ్డెర వృత్తిదారుల సంఘ నేతలు బెల్లంకొండ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సమన్యాయ సత్యశోధకుడు జ్యోతిరావ్ పూలే

నెల్లూరు(బారకాసు): సమన్యాయ సత్యశోధకుడు జ్యోతిరావ్ పూలే అని మేయర్ పీ స్రవంతి పేర్కొన్నారు. జ్యోతిరావ్ పూలే జయంతిని పురస్కరించుకుని కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలో గురువారం ఆయన చిత్రపటానికి మేయర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నేత జయవర్ధన్, శివ తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(అర్బన్): జిల్లా సర్వజన వైద్యశాలలోని సూపరింటెండెంట్ కార్యాలయంలో జ్యోతిరావ్ పూలే జయంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి సూపరింటెండెంట్ సిద్దానాయక్ పూలమాల వేసి నివాళులర్పించి ఆయన సంఘ సేవలను స్మరించుకున్నారు. ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి సుబ్రహ్మణ్యం, డాక్టర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్లు పాల్గొన్నారు.

న్యాయవాదుల నివాళి

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ కార్యాలయంలో పూలే చిత్రపటానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ప్రధాన కార్యదర్శి సుందరయ్యయాదవ్, తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమిటీ సభ్యులు ప్రసాద్, చంద్రశేఖర్, దాసరి రాజేంద్ర ప్రసాద్, రామకృష్ణ, గంగరాజు, విద్యాధర్‌రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని విద్యుత్ భవన్‌లో జ్యోతిరావ్ పూలే చిత్రపటానికి ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఈ శేషాద్రిబాలచంద్ర, డీఈఈ రవిచంద్ర, ఏఈలు తిరుపతయ్య, అనిల్, బీసీ అసోసియేషన్ నాయకులు ప్రసాద్, శేఖర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

పూలే సామాజిక సేవలు చిరస్మరణీయం

నెల్లూరు సిటీ: మహాత్మ జ్యోతిరావ్‌పూలే సామాజిక సేవలు చిరస్మరణీయమని వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. జ్యోతిరావ్‌పూలే జయంతిని పురస్కరించుకుని మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో పూలే దంపతుల చిత్రపటానికి ఆయన పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు మలిరెడ్డి కోటారెడ్డి, వైఎస్సార్ సేవాదళ్ రాష్ట్రాధ్యక్షుడు మాళెం సుధీర్‌కుమార్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీనివాస్, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసులు రెడ్డి, మూలే విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.



కార్పొరేషన్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మేయర్ స్రవంతి



పూలే దంపతుల విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జేసీ సేతు మాధవన్



ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో..



సామాజిక సమరసతా వేదిక ఆధ్వర్యంలో..



జీజీహెచ్‌లో...



నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యాలయంలో..



చేతివృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో..



సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో..



బీజేపీ ఓబీసీ మోర్చా ఆధ్వర్యంలో..

14న బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశం



నెల్లూరు(బృందావనం): వేదాయపాళెంలోని ఎంవీఎస్ కల్యాణ మండపంలో ఈ నెల 14న సాయంత్రం 6 గంటలకు బ్రాహ్మణ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు బ్రాహ్మణ సంఘాల నేతలు తడకపల్లి సుధారవీంద్ర, గుడ్లదొన వాసుదేవరావు, ఇసుకపల్లి కామేశ్వరప్రసాద్ తెలిపారు. మనుమసిద్ధి నగర్‌లోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోని బ్రాహ్మణులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

దివ్యాంగుడికి ట్రైసైకిల్ వితరణ



నెల్లూరు సిటీ: రూరల్ మండలం కాకుపల్లి దళితవాడకు చెందిన దివ్యాంగుడు దూడల శేషయ్యకు వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సోలార్ ట్రైసైకిల్‌ను గురువారం వితరణ చేశారు. మినీబైపాస్‌లోని ఆదాల కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వేలూరు శివసునీల్‌రెడ్డి, నాయకులు పాశం శ్రీనివాస్, తిరకాల శేషుగౌడ్, గుంటక వంశీ, కార్పొరేటర్లు ఒరిస్సా శ్రీనివాసులురెడ్డి మూలే విజయభాస్కర్‌రెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సులో మంటలు

నెల్లూరు(క్రైమ్): వైర్లు షార్ట్ సర్క్యూట్ అయ్యాయో లేక ఎవరైనా నిప్పు అంటించారో తెలియదుకాని నగరంలోని కస్తూరిదేవి స్కూల్ ఎదురుగా రోడ్డుపై నిలిపి ఉంచిన ఆర్టీసీ అద్దె బస్సులో గురువారం రాత్రి మంటలు చెలరేగాయి. స్థానికులు అందించిన సమాచారంతో అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపుచేశారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరావాల్సి ఉంది.

వైఎస్సార్‌సీపీలోకి వలసల పర్వం



పార్టీలో చేరిన 25వ డివిజన్ నేతలతో ఆదాల



పార్టీలో చేరిన ఉప్పుటూరు వాసులతో ఆదాల



పార్టీలో చేరిన సురేష్‌రెడ్డితో ఆదాల

నెల్లూరు సిటీ: వైఎస్సార్‌సీపీలోకి వలసల పర్వం కొనసాగుతోంది. నెల్లూరు రూరల్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రతిపక్ష పార్టీల నాయకులు, కార్యకర్తలు గురువారం పెద్దఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరారు. ఉప్పుటూరుకు చెందిన పలువురు వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో నెల్లూరులోని ఆయన కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో బెల్లంకొండ లీలయ్య, బెల్లంకొండ చెంచుకృష్ణ, బెల్లంకొండ వినోద్, ఉప్పు వినయ్, అచ్చి గోపి, అచ్చి శీనయ్య, అచ్చి జనార్దన్, తదితరులు ఉన్నారు. ఎంపీటీసీ శ్రీనివాసులురెడ్డి, నాయకులు ఒంటేరు దయాకర్, సుంకర శీనయ్య, మధుసూదన్‌రెడ్డి, అచ్చి వెంకటకృష్ణ, వల్లెపు గోపి, ఏడుకొండలు పాల్గొన్నారు.

• 26వ డివిజన్‌కు చెందిన పలువురు స్వచ్ఛందంగా వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో ఆదాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో వెంకటరాజు, వెంకటరాజేష్, కొప్పోలు ప్రేమ్‌కుమార్, సీహెచ్ శేషుకుమార్, ఆర్ చిన్నా తదితరులు ఉన్నారు.

• 24వ డివిజన్ కల్లూరుపల్లి హౌసింగ్‌బోర్డ్ కాలనీకి చెందిన పిడూరు సురేష్‌రెడ్డి వైఎస్సార్‌సీపీ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆదాల ప్రభాకర్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు మలిరెడ్డి కోటారెడ్డి, 24వ డివిజన్ నాయకులు ఉడతా మురళీయాదవ్, అన్నపురెడ్డి శేఖర్, రామలింగారెడ్డి జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

• 25వ డివిజన్‌కు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు జువ్వలదిన్నె మల్లికార్జున్, షేక్ నౌషాద్ ఆ పార్టీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మలిరెడ్డి కోటారెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. జిల్లా మైనార్టీ నాయకుడు ఆలీ, పీ రాజశేఖర్, తదితరులు ఉన్నారు.

• 22వ డివిజన్‌కు చెందిన 40 మంది టీడీపీ మద్దతుదారులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ఆదాల ప్రభాకర్‌రెడ్డి మినీబైపాస్‌లోని తన కార్యాలయంలో పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన రఫీ, సూరి వారి మిత్రబృందం సభ్యులను అభినందించారు.

వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారం చేస్తున్న సునంద, నేహారెడ్డి

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు అభివృద్ధి కోసం రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ఆ పార్టీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి కోరారు. గురువారం ఆమె తన తండ్రికి మద్దతుగా నెల్లూరు సిటీ నియోజకవర్గ పరిధిలోని 46వ డివిజన్‌లో తల్లి సునందరెడ్డి, స్థానిక కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, ఇతర నేతలతో కలిసి ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నెల్లూరు అభివృద్ధికి సంబంధించి ప్రత్యేకంగా రూపొందించిన మేనిఫెస్టో కరపత్రాలను అందజేశారు. నెల్లూరు ఎంపీగా తన తండ్రి విజయసాయిరెడ్డి, నెల్లూరు సిటీ ఎమ్మెల్యేగా ఖలీల్‌అహ్మద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు వేలూరు సుధారాణి, జిల్లా మహిళావిభాగం అధ్యక్షురాలు మొయిళ్ల గౌరి, పార్టీ మహిళా నేతలు హిమబిందు, బీ పద్మావతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈద్-ఉల్-ఫిత్ర్



నమాజ్ చేస్తున్న బాలిక



బారాషహీద్ దర్గా ప్రాంగణంలోని ఈద్గాలో సామూహికంగా ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



రంజాన్ సందేశాన్ని అందజేస్తున్న ఇమామ్



నమాజ్ చేస్తున్న బాలుడు

నెల్లూరు(బృందావనం): నగరంలోని ముస్లింలు ఈద్-ఉల్-ఫిత్ర్‌ను గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. నగరంలోని బారాషహీద్ దర్గా, రంగనాయకులపేట, సంతపేట, నవాబుపేట, నజీర్‌తోట, డైకస్‌రోడ్డు, గాంధీనగర్, తదితర ప్రాంతాల్లోని మసీదులు, ఈద్గాల వద్దకు ముస్లింలు పెద్దఎత్తున తరలివచ్చి సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. మతపెద్దలు రంజాన్ సందేశాన్ని అందజేశారు. అనంతరం పేదలకు తమ వంతుగా దానధర్మాలు చేశారు. తొలుత సంప్రదాయ దుస్తులతో ప్రత్యేక ప్రార్థనలకు హాజరైన ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సన్మార్గం వైపు పయనించాలి

సర్వమానవాళి మార్గదర్శకం కోసం దివ్యఖురాన్ ఆవిర్భవించిందని, ప్రతిఒక్కరూ ఖురాన్‌ను పఠించి సన్మార్గం వైపు పయనించాలని బారాషహీద్ దర్గా ఈద్గా ఇమామ్ ఒ ఖతీబ్ సయ్యద్ అబూబకర్ అష్రఫి సాబిరి అన్నారు. బారాషహీద్‌దర్గా ప్రాంగణంలోని ఈద్గా మైదానంలో జరిగిన సామూహిక ప్రార్థనలకు హాజరైన ముస్లింలకు ఇమామ్ అబూబకర్ అష్రఫి సాబిరి దైవసందేశాన్ని అందజేశారు. సర్వమానవుల జీవితాలు ఆనందమయంగా సాగేందుకు ఖురాన్ ఆవిర్భవించిందన్నారు. చంద్రమానాన్ని అనుసరించి ఇస్లామియా క్యాలెండర్ ప్రకారం రంజాన్ నెలను ముస్లింలు అత్యంత పవిత్ర మాసంగా పరిగణిస్తారన్నారు. అందుకు ప్రధాన కారణం దివ్యఖురాన్ ఈ మాసంలో ఆవిర్భవించడమేనన్నారు. దివ్యఖురాన్ అవతరించిన నాటి నుంచి నేటి వరకు ఎటువంటి మార్పులు, చేర్పులు చోటుచేసుకోకుండా సురక్షితంగా ఉందన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో పాటించే కఠోర ఉపవాసదీక్షలతో అల్లాహ్ ప్రసన్నత కలుగుతుందన్నారు. ఉపవాసదీక్షలు మానవులను పాపాల నుంచి దూరం చేయడమే కాకుండా ఆత్మశుద్ధి పొందేందుకు దోహదపడుతాయన్నారు. ప్రతిఒక్కరూ జీవితంలో తాము చేసే ప్రతి మంచి, దుష్కర్మలకు మరణానంతరం తీర్పు దినం ఖయామత్ నాడు అల్లాహ్‌కు సమాధానం చెప్పాల్సి ఉంటుందన్నారు. దాని ప్రతిఫలంగా స్వర్గం, నరకం ప్రాప్తి కలుగుతుందని మహాప్రవక్త మొహమ్మద్ తెలియజేశారన్నారు. సద్గుణాలు, సచ్ఛీలత, సత్ప్రవర్తన, సాంఘీకన్యాయం, సమానత్వం, దైవభక్తి ద్వారానే మానవుల హృదయాలను ఇస్లాం జయించిందని వివరించారు.



నజీర్‌తోట ఈద్గాలో ప్రార్థన చేస్తున్న ఖలీల్

అల్లా ఆశీస్సులతో సుఖసంతోషాలతో ఉండాలి

నగరంలోని 9వ డివిజన్, నజీరుతోటలోని ఈద్గా మైదానంలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎండీ ఖలీల్‌అహ్మద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఖలీల్‌అహ్మద్ మాట్లాడుతూ పవిత్ర రంజాన్ పండగ సందర్భంగా నజీరుతోట ఈద్గాలో ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనల్లో పాల్గొనడం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి కుటుంబానికి అల్లా ఆశీస్సులు ఉండాలని, ప్రతిఒక్కరూ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అల్లా ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్పొరేటర్లు దామవరపు రాజశేఖర్, కిన్నెర ప్రేమ్‌కుమార్, షేక్ కరీముల్లా, వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు హంజాహుస్సేని, జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ మీరా మొహిద్దీన్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): 54వ డివిజన్, జనార్దన్‌రెడ్డి కాలనీలోని ఈద్గా మైదానంలో ముస్లింలు సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక మసీదుల్లో నమాజులు చేశారు. ముస్లింలు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



వెంకటేశ్వరపురంలోని ఈద్గాలో...



మస్జిద్ ఏ షెహెన్‌షాలో ..